క్లుప్తంగా

ఎమ్మెల్యే నివాళి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డిగారి వెంకటరమణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆరోగ్య కేంద్రం తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి, చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. ఓపీ, మందుల వివరాలు, రోగులకు అందిస్తున్న సేవలు గురించి వైద్యాధికారి ఆర్. మాధవిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, రికార్డులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, ఏఓ హేమలత, పంచాయతీ కార్యదర్శులు రెడ్డిశేఖర్, శశికళ, వీఏఏ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు ముఖ్యం



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి లక్ష్మి

–తజిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి లక్ష్మి

బైరెడ్డిపల్లె: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ లక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, ల్యాబ్ రూమ్, స్కానింగ్ రికార్డులు, ఐఈసీ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. సమయపాలన విధిగా పాటించాలన్నారు. ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాటు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సావిత్రమ్మ, సీహెచ్ఓ జయంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



మంజునాథ్ (ఫైల్)

గంగవరం: కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలు.. పెద్దపంజాణి మండలం పొట్టగానిపల్లెకు చెందిన మంజునాథ్((17) ఈ నెల 22న మండలంలోని కల్లుపల్లెల్లి చెక్‌పోస్టుకు సమీపంలో బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అత్యవసర చికిత్స నిమిత్తం అతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబీకులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామానికి తరలించారు.

ట్రాన్స్‌కో స్టోర్స్ హమాలీల ఆందోళన

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్టోర్స్ ఎదుట ఆందోళన చేశారు. స్టోర్స్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరోగ్యదాస్ మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 14 వరకు దశలవారీ ఆందోళన చేయనున్నట్టు చెప్పారు. అలాగే తిరుపతిలోని సీఎండీ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్ టెండర్లు పిలవరాదని, ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాన్ని పెంచి, ఏరియా అలవెన్సు ఇవ్వాలన్నారు. అధికారులు అనాలోచిత నిర్ణయం వల్ల మూడో వ్యక్తికి టెండర్లకు పిలవడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు సొసైటీగా ఏర్పాటు చేసుకొని పీస్ రేటు పద్ధతిలో పని చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు టెండర్లు ఆహ్వానించి కొత్తగా కాంట్రాక్టర్ చేతిలో హమాలీల భవిష్యత్ పెట్టాలని చూస్తోందన్నారు. అనంతపురంలో ఈ విధానం కాంట్రాక్టర్‌కు ఇచ్చారని, ఇదే విధానం జిల్లాకు తీసుకురావాలని చూస్తే సహించేది లేదన్నారు. నాయకులు శివకుమార్, ఆనంద్, రాజీబాయ్, మురగ, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎటుచూసినా చవితి కోలాహలమే..!



పుంగనూరు: వినాయకుడి ప్రతిమలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



వి.కోట: కొనుగోళ్లతో సందడిగా ఉన్న పట్టణం

- పటిష్టంగా వినాయక చవితి ఏర్పాట్లు
- జోరుగా పందిళ్లు ఏర్పాటు
- కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట
- గ్రామాల్లోనూ పండుగ సందడి

పుంగనూరు: వినాయక చవితి పండుగ కోలాహలంతో పుంగనూరు సందడిగా మారింది. మంగళవారం పట్టణంలోని తేరువీధి, బజారువీధి, కుమ్మరవీధి, కట్టక్రిందపాళెం, తూర్పుమొగశాల, ఎంబీటీటి రోడ్డు, బస్టాండు, గోకుల్ సర్కిల్ , మేలుపట్ల , బాలాజి థియేటర్, ఎన్ఎస్.పేట , భగత్‌సింగ్ కాలనీ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా సుమారు 160 చోట్ల చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా చేశారు. పందిళ్లు వేసి, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. పట్టణంలో పండుగ సంతకు జనం రద్దీ కనిపించింది. మట్టి వినాయకుడి ప్రతిమలు, అరటి, మామిడి, వెలగ, జామ, దానిమ్మ, జిల్లేడు, బిల్వపత్రి, గరిక పత్రాలు, చాటలు, పుటికలు, వెలగపండ్లు విక్రయాలు జోరుగా సాగాయి. 10 రోజుల పాటు చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్, సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఇప్పటికే ఉత్సవ కమిటీలకు మార్గదర్శనం చేశారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

పుంగనూరు: మట్టి గణపతి ప్రతిమలకే ప్రాధాన్యత ఇచ్చి పూజలు చేయాలని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం వంద మట్టిగణపతి ప్రతిమలను విద్యార్థులతో తయారు చేయించి పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, జలజ, వనజ, షాహీనా, సత్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపయ్య ప్రతిమల పంపిణీ

పుంగనూరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం బాలసుబ్రమణ్యం దీక్షితులు, రాము దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీవారాహి బృందం యువకులు భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, శాస్త్ర పద్ధతిలో గణపతులను తయారు చేసి, పసుపు, కుంకుమ, గోమయం, వట్టివేరు, పచ్చ కర్పూరం, శ్వేతచందనం, రక్తచందనం, విభూది, వివిధ ధాన్యాలు తదితర 21 శుభ ద్రవ్యాలతో ఈ ప్రతిమలను 20 రోజుల పాటు తయారు చేసినట్టు చెప్పారు. .

సదుంలో..

సదుం: వినాయక చవితి పురస్కరించుకుని మండల వ్యాప్తంగా పలుచోట్ల యువకులు ఉత్సాహంగా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిమలు, పత్రాలు, పూజాసామగ్రి కొనుగోలు నిమిత్తం మండల కేంద్రానికి పలువురు రావడంతో బస్టాండు ప్రాంతం కోలాహలంగా మారింది. గ్రామీణ ప్రాంతాల ఆర్టీసీ సర్వీసులు కూడా ప్రయాణికుల రద్దీతో కనిపించాయి.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలో పలు చోట్ల వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేయడంలో యువకులు, భక్తులు నిమగ్నమై ఉన్నారు. వివిధ మండపాల వద్ద విద్యుత్ దీపాల శోభతో రెండ్రోజుల నుంచి పట్టణమంతా కొత్త శోభ సంతరించుకుంది. ఇక పూజాసామగ్రి, పండ్ల దుకాణాలు, వినాయక ప్రతిమల కొనుగోలుదారులతో ఆయా మార్కెట్లు కిటకిటలాడాయి.

మట్టి వినాయకుని ప్రతిమల పంపిణీ

పుంగనూరు: పట్టణంలోని శ్రీకాశివిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం బాలసుబ్రమణ్యం దీక్షితులు, రాము దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీవారాహి బృందం యువకులు భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, శాస్త్ర పద్ధతిలో గణపతులను తయారు చేసి, పసుపు, కుంకుమ, గోమయం, వట్టివేరు, పచ్చ కర్పూరం, శ్వేతచందనం, రక్తచందనం, విభూది, వివిధ ధాన్యాలు తదితర 21 శుభ ద్రవ్యాలతో ఈ ప్రతిమలను 20 రోజుల పాటు తయారు చేసినట్టు చెప్పారు. .

మట్టి వినాయక విగ్రహాలను వాడాలి

రొంపిచెర్ల: ప్రజలు మట్టి వినాయక ప్రతిమలనే చవితి వేడుకల్లో పూజించాలని ఎంఈఓ శ్రీనివాసులు కోరారు. మట్టి వినాయక విగ్రహాల వాడకంపై మంగళవారం రొంపిచెర్లలో అవగాహన ర్యాలీ, సర్కిల్‌లో మానవ హారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్లాస్టరాఫ్ ప్యారిస్‌తో చేసిన చేసిన విగ్రహాలను వాడడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. మట్టి వినాయక విగ్రహాలను వాడితే ఎలాంటి ముప్పు ఉండదన్నారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు నాగరాజ, రఫిబాషా, దేవకి యశోద, విద్యార్థులు పాల్గొన్నారు.



పుంగనూరు: పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం



రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమిలో మట్టి ప్రతిమలతో విద్యార్థులు



సదుం: వినాయక ప్రతిమలు విక్రయిస్తున్న దృశ్యం



కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో గణపతులను పంపిణీ చేస్తున్న దృశ్యం



రొంపిచెర్లలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్ద మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

గంగవరం: వినాయకచవితి సందర్భంగా మండలంలో ఎక్కడైనా పెద్ద..పెద్ద మండపాలు ఏర్పాటు చేస్తున్న పక్షంలో నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి పొందడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మండపాలు, ఊరేగింపు, సౌండ్ సిస్టమ్‌కు సంబంధించి పోలీస్ శాఖ నిబంధనలు విధిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు.

అభినందన



మహేష్‌బాబు (ఫైల్)

గంగవరం: మదర్‌థెరిసా కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న పలమనేరు వాసి మహేష్‌బాబు డీఎస్సీ పరీక్షల ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్) జిల్లాలో 4వ ర్యాంకు, టి.జి.టి(మ్యాథ్స్) జిల్లాలో 3వ ర్యాంకు సాధించారు. ఇలా కళాశాలతో పాటు మదర్‌థెరిసా సీబీఎస్ఈ స్కూల్‌లో పనిచేసిన ఆయన డీఎస్సీలో సత్తా చాటినందుకు కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, తోటి అధ్యాపకులు అభినందించారు.









ఒకే రోజు నిమజ్జనం చేస్తే బెటర్

- డీజేలు, డ్యాన్సులను అనుమతించేది లేదు
- పీస్ కమిటీ సమావేశంలో పలమనేరు డీఎస్పీ డేరంగుల ప్రభాకర్



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ డేరంగుల ప్రభాకర్

పలమనేరు: వినాయకచవితి సందర్భంగా పట్టణంలోని పలుచోట్ల వినాయక ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారని, అయితే వీటిని వారికి నచ్చినన్ని రోజులు పెట్టుకుని ఆపై నిమజ్జనం చేయడం సరికాదని, నిర్వాహకులందరూ చర్చించుకుని పట్టణంలోని ప్రతిమలన్నింటినీ ఒకే రోజు నిమజ్జనం చేయాలని డీఎస్పీ డేరంగుల ప్రభాకర్ కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా సాగాలన్నదే ఈ సమావేశం ముఖ్యోద్దేశమన్నారు. ముఖ్యంగా జలధి రోజు మద్యం సేవించి గొడవలకు పాల్పడటం లాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిమజ్జనంలో ఎవరెవరు పాల్గొనాలో నిర్వాహకులే నిర్ణయించుకోవాలన్నారు. ఎవరు నిమజ్జనం కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొనాలో నిర్వాహకులే నిర్ణయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా డీజే పాటలు, డ్యాన్సులను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఇదే విషయమై ఆర్డీఓ భవాని, ఎంవీఐ మధుసూదన్, తహసీల్దార్ ఇన్బునాధన్, సీఐ నరసింహరాజు, కమిషనర్ రమణారెడ్డి సైతం పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ భూమికి విముక్తి

సాక్షి ఎఫెక్ట్..



వంక పొరంబోకు స్థలానికి ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పుంగనూరు: పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డు వద్ద ఉన్న రాయలచెరువు వంక పొరంబోకు స్థలం కబ్జా కాకుండా మంగళవారం రెవెన్యూ అధికారులు ట్రెంచ్ ఏర్పాటు చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే వంక పొరంబోకు స్థలం సర్వే నంబర్ 110/1లో 81 సెంట్లు కబ్జాకు గురైంది. దీనిపై సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. జేసీబీతో ట్రెంచ్ ఏర్పాటు చేశారు.

పంటలపై ఆగని గజ దాడులు



తిప్పిరెడ్డిపల్లె సమీపంలో ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లె పంచాయతీలో అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లె, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లె, జిట్టంవారిపల్లె, పెనుగొలకల, పెద్దకాప్పవల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. సోమవారం రాత్రి పలమనేరు ఫారెస్టు రేంజ్ కీలపట్ల బీటు నుంచి వచ్చిన ఏనుగులు తిప్పిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని పంటలపై పడి నష్టం కలిగించాయి. శ్రీరాములు రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరుల వరి పంటను నాశనం చేశాయి. మంగళవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత రైతులు మాట్లాడుతూ చేతికొచ్చిన పంటలను ఏనుగుల వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కుంకీ ఏనుగులతో అటవీ ఏనుగులను పంటలపైకి రాకుండా కట్టడి చేస్తామన్న అటవీ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సమాచారం అందుకున్న రాయలపేట ఫారెస్టు బీట్ సెక్షన్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం పంట నష్టాన్ని పరిశీలించారు.

మంగళపల్లె స్కూల్‌కు యూఎస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు



ఉపాధ్యాయులకు యూఎస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 'యూఎస్ బుక్ ఆఫ్ రికార్డ్' సాధించినట్లు హెచ్ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. పాఠశాల ఆధ్వర్యంలో మంగళ విద్యావాణి మాసపత్రిక నడుపుతున్నందుకు యూఎస్ఏ అవార్డు వచ్చిందన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ ఉపాధ్యాయులకు అవార్డును అందజేశారు. ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామీణ ప్రాంతమైన మంగళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళ విద్యావాణి మాసపత్రికను నడపడం అభినందనీయమని, ఇప్పటి వరకు 35 సంచికలను విడుదల చేయడం గర్వకారణమని చెప్పారు. మాసపత్రిక నడుపుతున్న ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు. పాఠశాల యూఎస్ఏ అవార్డు సాధించడం గర్వకారణమన్నారు. దాత ధరణీప్రసాద్ మాట్లాడుతూ, మాసపత్రిక ముద్రణకు అయ్యే ఖర్చు తానే అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ హెచ్ఎం లలిత, గణిత అవధాని అరుణ్ శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31న బీఎంఎస్ క్లబ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఈనెల 31న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పి.శివ మంగళవారం తెలిపారు. పుంగనూరు, మదనపల్లె లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తామని, ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి, కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. దీనిని నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న వాహనాల వేలం

పలమనేరు: మోటారు వాహనాల తనిఖీలో సీజ్ చేసిన వివిధ వాహనాలను సెప్టెంబర్ 4న తమ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్టు స్థానిక ఎంవీఐ మధుసూదన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డుతోపాటు రీఫండబుల్‌గా రూ.5వేలను కట్టి పాల్గొనాలని, లైట్ మోటార్ వాహనాలు, బైక్‌లు, మాక్సీక్యాబ్‌లు..ఇలా మొత్తం 19 వాహనాలను వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు.

